క్లుప్తంగా

గిరి భక్తులకు బాదం పాలు పంపిణీ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు బాదం పాలుతో పాటు రొట్టెలు, సమోసాలు, స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ సేవా కార్యక్రమం నిర్విరామంగా సాగింది. దాతల సహకారంతో 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్‌కుమార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని మద్దిలపాలెం గ్రామ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోస ఎర్రయ్య అన్నారు. ఆదివారం మద్దిలపాలెం సీఎంఆర్ శ్మశానవాటికలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


యోగా గురువు రమేష్‌కు సత్కారం



యోగా గురువు రమేష్‌ను సత్కరిస్తున్న శిష్యులు

ఎంవీపీ కాలనీ: గురు పౌర్ణమి సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని గాదిరాజు ఎంపైర్‌లో ఓం యోగా వ్యవస్థాపకుడు, యోగా శిక్షకుడు డాక్టర్ సీహెచ్ రమేష్‌ను ఆయన శిష్య బృందం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గురు పూజోత్సవం రోజు సత్కరించుకోవడం భారతీయ సంప్రదాయమన్నారు. యోగా శిక్షణ ద్వారా డాక్టర్ రమేష్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్ర, శాంతారావు, సురేష్‌బాబు, శర్మ, వరలక్ష్మీ, దేవి, రూప తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనం కోసం ఎంపీలు గళం విప్పాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వం వద్ద గళం విప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విళ్ల రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1456వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, మాంగనీస్ గనులకు అనుమతులు మంజూరు చేసిన క్రమంలోనే ఎంపీలు కూడా కేంద్రం వద్ద పట్టుబట్టి విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర, ఎస్.సత్యనారాయణ, బి.తవుడన్న, సూర్యం, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, నాయక్, గోపయ్య, తదతరులు పాల్గొన్నారు.

అంతటా అంధకారం!

- పలు ప్రాంతాల్లో వెలగని విద్యుత్ దీపాలు
- మొరాయించిన సోలార్ లైట్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



చినవాల్తేర్ రజక వీధిలో వెలగని సోలార్ విద్యుత్ దీపం



అంధకారంలో లాసన్స్ బే పార్కు ప్రాంతం

ఎంవీపీ కాలనీ: నగరంలో పేరొందిన ఎంవీపీ కాలనీలోని పలు సెక్టార్లతో పాటు పెదజాలరి పేట, చినవాల్తేర్‌లోని పలు ప్రాంతాల్లో అంధకారం రాజ్యమేలుతోంది. కొంత కాలంగా ఆయా ప్రాంతాల్లోని పలు చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షకాలం సమీపించిన నేపథ్యంలో ఇప్పటికే విద్యుత్ దీపాల పునరుద్ధరణపై ఆ శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సి ఉంది. ఆయా వార్డుల్లో పరిస్థితిని సమీక్షించి అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలి. అయితే ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారలు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఎంవీపీ కాలనీ, చినవాల్తేర్, జాలరిపేట వాసులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల సోలార్ విద్యుత్ దీపాలు సైతం మొరాయించాయి.

- 20వ వార్డు చినవాల్తేర్ అమ్మవారి వీధిలో పలు విద్యుత్ దీపాలు వెలగడంలేదు. 172/బీబీ/1



చినవాల్తేర్ అమ్మవారి వీధిలో వెలగని లైటు

విద్యుత్ స్తంభంతో పాటు ఆ వీధిలోని పలు విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. రజకవీధి, పీతలవారి వీధిలో పలు చోట్ల విద్యుత్ లైట్లతో పాటు సోలార్ దీపాలు సైతం వెలగడంలేదు. కొన్ని చోట్ల సోలార్ లైట్లు రాత్రి 8, 9 గంటలకే ఆగిపోతున్నాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్–3, 6, 9లలో కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పోల్ నంబర్ 33/బీ/5, 7లతో పాటు మరికొన్ని విద్యుత్ స్తంభాల వద్ద ఇదే పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట పూర్తి అంధకారం నెలకుంటోందని స్థానికులు చెబుతున్నారు.

- లాసన్స్ బే పార్కుకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ఈ మార్గంలో మత్స్యకారులు వేట సామగ్రిని భద్రపరుస్తుంటారు. ఈ మార్గంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడం ఆందోళన కలిగిస్తుందని జాలరిపేట వాసులు వెల్లడిస్తున్నారు. జాలరిపేట గ్రామంలో పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదుల సంఖ్యంలో ఎల్ఈడీ లైట్స్, సోలార్ లైట్స్ వెలగడం లేదని, వాటిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టాలి

చినవాల్తేర్ అమ్మవారి వీధిలో కొంత కాలంగా పలు విద్యుత్ దీపాలు వెలగడంలేదు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు అధికారులకు ఫిర్యాదులు చేశాం. అయినా సమస్య నేటికి పరిష్కారం కాలేదు. 20వ వార్డులో పెద్ద ఎత్తున సోలార్ విద్యుత్ దీపాలు వెలగడం లేదు. కొన్ని వీధుల్లో వెలుగుతున్నా రాత్రి 9 గంటలకే ఆగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని పునరుద్ధరించాలని కోరుతున్నాం. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టి, సమస్యను పరిష్కరించాలి.

–గుంటుబోయిన గోవిందమ్మ, 20వ వార్డు

వైభవంగా గురు పౌర్ణమి



10వ వార్డు ఆదర్శ నగర్‌లో సాయిబాబా ఆలయంలో అన్నాభిషేకం



ఎంవీపీ సెక్టార్-6లో బాబాకు అన్నాభిషేకం చేసిన భక్తులు

ఆరిలోవ: గురు పౌర్ణమి వేడుకలు తూర్పు నియోజకవర్గంలో ఆదివారం వైభవంగా జరిగాయి. జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో షిర్డీ సంస్థాన్ ఆలయం, 10వ వార్డు ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయం, 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదర్శనగర్ ఆలయంలో స్వామికి అన్నాభిషేకం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు కాగడా హారతి, పుష్పాలంకరణ, మధ్యాహ్న హారతి, అన్నాభిషేకంతో ముగిశాయి. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని షిర్డీ సాయి పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో బాబాకు పూలు, తులసి మాలల అలంకరణతో తీర్చిదిద్ది క్షీరాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అఖండ హారతి ఇచ్చారు. సాయిబాబాను దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలోని సీతారామా సేవా సంఘం ఆధ్వర్యంలో సాయినాథుని మందిరంలో విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. హెచ్‌బీ కాలనీలోని ఎల్లమాంబ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కొత్త వెంకోజిపాలెం సాయినాథ్ మందిరంలో 108 వంటకాలతో ప్రసాదం నివేదిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: ఈస్ట్ పాయింట్ కాలనీ లెండి వనంలోని సాయిబాబాకు పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. జీవీఎంసీ 28వ వార్డులోని సీ షెల్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ప్రారంభించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



28వ వార్డులో అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు



లెండి వనంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తునన భక్తులు



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్న సమారాధనలో భక్తులు



కొత్త వెంకోజిపాలెం సాయినాథ్ మందిరంలో 108 వంటకాలతో ప్రసాదం

దైవం ఇచ్చిన వరమే సంగీతం



మాట్లాడుతున్న గోపాలరావు

బీచ్ రోడ్డు : మనసును రంజింప చేసేది రాగమని, దైవం ఇచ్చిన వరమే సంగీతమని ప్రముఖ సంగీత విద్వాంసుడు పంతుల గోపాలరావు అన్నారు. గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా రాంనగర్ రాఘవేంద్ర స్వామి మఠం సమావేశం మందిరంలో ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంగీతం, భక్తి రెండు కలిసి సాగాలని, గురువు వద్ద భక్తితో ఉండడం, జ్ఞానాన్ని పొందడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థికి ఏ విధంగా జ్ఞానాన్ని అందించాలి అనేది గురువుకి అవగాహన ఉంటుందన్నారు. విభిన్న స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా గురువు బోధన చేసి వారికి అవగాహన కల్పిస్తారని చెప్పారు. నిత్యం సాధన చేస్తూ ఉంటే విద్యలో పరిణితి సాధించడం వీలవుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు స్వయంగా పంతుల గోపాలరావుకు పాద పూజ నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి మధు బాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం : రక్తదానం ఎంతో గొప్ప విషయమని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కై తపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేతినేపేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సమయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు బ్లిస్ క్యాటరింగ్స్ ఎండీ లక్ష్మీ లావణ్య బహుమతులు అందించారు. గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్ని, ఎ.కిశోర్, ఆర్.బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆటో దిగుతుండగా ప్రమాదం.. వ్యక్తికి గాయాలు



తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి

ఆరిలోవ: ఆటో దిగుతూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కింద పడి గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం కూడలి వద్ద ఓ వ్యక్తి ఎండాడ వైపు వెళ్లే ఆటో ఎక్కాడు. ఆయన ఎండాడ కూడలిలో దిగాల్సి ఉంది. ఆ కూడలి ముందు సిగ్నల్ పడే సమయంలో ఆటో పూర్తిగా ఆగక ముందే కిందకు దిగే ప్రయత్నం చేస్తూ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఆయన స్పృహ కోల్పోవడంతో స్థానికుల సహాయంతో అక్కడ ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో ఆయనకు వైద్యం అందిస్తున్నారు. అతనికి స్పృహ రాలేదు. తల లోపల భాగంలో తీవ్ర గాయాలు తగిలి ఉంటాయని వైద్యులు భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తికి ప్రమాదంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కూలిన ఇంటి శ్లాబ్

కుటుంబానికి తప్పిన ప్రమాదం



ఇంట్లో పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

కంచరపాలెం: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల ధాటికి ఓ ఇంటి శ్లాబ్ నానిపోయి నిద్రిస్తున్న ఓ కుటుంబంపై కూలిపోయింది. ఈ ఘటన 47వ వార్డు కప్పరాడ కొండ సమీపంలోని అరుధంతినగర్‌లో దేవి, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న ఇంట్లో జరిగింది. వర్షాల కారణంగా శ్లాబ్ పైకప్పు నానిపోయి, ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌తో సహా శనివారం రాత్రి మంచంపై నిద్రిస్తున్న పిల్లలపై ఒక్కసారిగా పడిపోయింది. అదృష్టవశాత్తు వారంతా తప్పించుకుని స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి పిల్లల కాళ్లు, చేతులకు స్వల్పగాయలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు అక్కడికి చేరుకుని, సంబంధిత అధికారులకు తెలియజేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకు వెళ్తామని వారు హామీ ఇచ్చారు.

నిరాశ్రయుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



నిరాశ్రయుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి ఆదివారం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పరవాడ ఏరియాలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఉంటున్నాడనే సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న అతనికి ఎవరూ లేరని తెలుసుకొని సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. మతిస్థిమితం కూడా సరిగా లేకపోవడంతో అతనికి అవసరమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు మమత తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్‌ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మత్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్‌ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పెదగదిలి వద్ద తీగలు వేలాడుతున్న ట్రాన్స్‌ఫార్మర్



నేలపై అమర్చని లైన్‌లో తెగిన విద్యుత్ తీగలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన పెదగదిలి కూడలి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. స్విచ్ బోర్డుకు అమర్చిన మూతలు తెరుచుకుని ఉండడం, దాని నుంచి విద్యుత్ తీగలు బయటకు వేలాడడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన లైన్‌లో కూడా మధ్యమధ్యలో తీగలు తెగిపోయాయి. పిచ్చి మొక్కలు అక్కడ దట్టంగా ఉండంతో పచ్చిక అనుకుని ఆశతో మేత కోసం పాడి పశువులు అటుగా వెళ్తూ విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. తెగిన విద్యుత్ తీగలు నేలపైనే ఉండటంతో మూత్ర విసర్జన కోసం అటుగా వెళ్లేవారు షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఓ పాడి ఆవు ఆ తీగలు తగిలి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. పొరపాటున ఏదో సమయంలో అటుగా మనుషులు వెళ్లినా అదే విధంగా ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు నిర్లక్ష్యంతో ఓ మూగ జీవి ప్రాణాలు బలయ్యాయని మండిపడుతున్నారు. మనుషులకు ఎలాంటి ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

గోపాలపట్నం: ఎన్ఏడీ జాతీయ రహదారి బస్ స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

న్యాయం చేసే వరకూ ఆందోళన చేస్తాం

మధురవాడ : భూములు కోల్పోయిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం ప్రాంతాల రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తారని సీపీఎం నాయకులు డి.అప్పలరాజు అన్నారు. రెండో రోజు ఆదివారం కూడా బక్కన్నపాలెంలోని సినీ పరిశ్రమ నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద రైతులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా చూడడంతోపాటు వారితో రోజుకో విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత రైతులకు కనీసం కాలనీ ఇళ్లయినా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, రైతు సంఘం పెద్దలు బి.పోతురాజు, ఎన్.పైడిరాజు, నాగేశ్వర్, అప్పారావు, కాంతం పాల్గొన్నారు.

తీరంలో మత్స్యకారుల ఆకలి కేకలు



వర్షాలతో తీరానికే పరిమితమైన వలలు

కొమ్మాది : గత ఐదు రోజుల నుంచి తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులు వేటకు పూర్తిగా విరామం ప్రకటించారు. ఇప్పటి వరకు అన్ సీజన్ కావడంతోపాటు అప్పులు చేసి మరీ బోట్లను, పడవలను, వలలను కొని, మరి కొన్ని మరమత్తులు చేసుకుని వేటకు సిద్ధమయ్యారు. ఇంతలోనే తుఫాన్ రావడంతో ఐదు రోజుల నుంచి వేట సాగక మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తీర ప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ సమయంలో కూటమి నాయకుల ఏ ఒక్కరూ ఇటువైపు చూడలేదని, సహాయక చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వాతావరణం అనుకూలించక పోవడంతోపాటు తుఫాన్ ప్రభావం కొనసాగడంతో మరో రెండు రోజులు ఇంటికే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.